క్లుప్తంగా

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ



అలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు

కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానం ఆలయం చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. బండవెల్కిచర్లలో సోమవారం జరిగిన గిరి ప్రదక్షిణలో పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మఠం రాజశేఖర్, పాండుశర్మ, నర్సింహారెడ్డి, బస్వరాజు, రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్, రాములు, సతీష్, గణేశ్, నర్సింహులు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



నోటు పుస్తకాలతో విద్యార్థులు, దాత తదితరులు

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూతనందించడమే తన లక్ష్యమని గొండ్ల ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మోమిన్‌పేట మండలం చంద్రాయన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. చిన్నారులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మల్లేశం, మాజీ అధ్యక్షుడు మాణిక్యం తదితరులు ఉన్నారు.

గురువుకు శిష్యుల సన్మానం



గురువును సన్మానిస్తున్న శిష్యబృందం

కొడంగల్: గురు పౌర్ణమి సందర్భంగా పట్టణానికి చెందిన యువకులు సోమవారం విద్యాబుద్ధులు నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయుడు చక్రవర్తి మధుసూదన్‌రావ్ దంపతులను పూలమాల వేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, లయన్స్ క్లబ్ సభ్యుడు మురహరి వశిష్ట మాట్లాడారు. గురువును సత్కరించడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సరాఫ్ శ్రీనివాసా చారి, భారతయ్య, పరమేష్, చిట్లపల్లి శ్రీనివాస చారి, చందు తదితరులు ఉన్నారు.

పెద్దచెరువు తూముకు మరమ్మతు



మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పెద్దచెరువు తూముకు మరమ్మతు పనులు చేపట్టారు. తూము తెరిచే దగ్గర ఓ రేకు అడ్డుగా ఇరుక్కుపోవడంతో నాలుగేళ్లుగా నీటిని వదలడానికి వీలుకాలేదు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు రెండు రోజులుగా చెరువు తూము వద్ద కట్ట వేసి మరమ్మతు పనులకు చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. మరమ్మతులకు నిధులు లేకపోవడంతో స్థానిక సర్పంచ్ శిరీష, మండల నాయకులు చొరవ తీసుకుని పంచాయతీ నిధులతో చేయించాలని నిర్ణయించారు. దీంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గోరింటాకు సంబురం



గోరింటాకును పెట్టుకున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

కుల్కచర్ల: ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం శుభసూచికంగా భావిస్తారని అంగన్‌వాడీ టీచర్ పందరీబాయి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గోరింటాకు సంబురాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గోరింటాకు శాస్త్రీయంగా ఉపయోగకరమైనది కావడంతో ఆడబిడ్డలు మైదాకు పెట్టుకోవడానికి మక్కువ చూపుతారని, అందుకోసమే ఈ ఉత్సవాన్ని నిర్వహించామని ఆమె వెల్లడించారు.

చినుకు లేక.. మొలక రాక

- ఆందోళనలో అన్నదాతలు
- చినుకు జాడకోసం.. ఆకాశం వైపు చూపు
- పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుందంటున్న రైతులు



నారెగూడలో విత్తనాలు విత్తి పది రోజులైనా మొలకెత్తని పత్తి

నవాబుపేట: తొలకరి జల్లులకు అధిక శాతం అన్నదాతలు విత్తనాలు వేశారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో సాగుకు సమాయత్తం అయ్యారు. కానీ వారం రోజులుగా చినుకులు రాలకపోవడంతో ఒక్క గింజ మొలకెత్తలేదు. దీంతో రైతులు వరుణుడి కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడకపోతే వేసిన గింజలు మట్టిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నవాబుపేట మండలంలో 80 శాతం మంది రైతులు తొలకరి వర్షాలకే విత్తనాలు విత్తారు. వానాకాలం సీజన్‌లో ఇక్కడి కర్షకులు అధికంగా పత్తి, మొక్కజొన్న, కంది, తదితర పంటలు సాగు చేస్తారు. సమయానుకూలంగా వర్షాలు పడకపోతే దిగుబడులు తగ్గిపోతాయి. చీడ పీడల బెడదతో పాటు పత్తి పంటకు తెగుళ్ల సోకే ప్రమాదం లేక పోలేదు. 10 రోజుల కిందట కురిసిన వర్షాలతో ఆశలు పెంచుకున్న అన్నదాతలు.. వ్యవసాయం పనులు వేగిరం చేశారు. కానీ వరుణుడు ముఖం చాటేయడంతో దిక్కుతోచని స్థితిలో నింగివైపు దీనంగా చూస్తున్నారు.

ఆదిలోనే కష్టాలు..

వానాకాలం (ఖరీఫ్) సీజన్ ఆరంభంలోనే రైతులకు నష్టాలు మొదలయ్యాయి. జూన్ మూడో వారం నుంచి రాష్ట్రానికి రుతుపవనాలు వస్తాయని శాస్త్ర వేత్తలు ప్రకటించడంతో ఇక్కడి రైతులు విత్తనాలు వేశారు. ఆలస్యంగా నైనా రుతుపవనాలు వచ్చాయని సంబుర పడేలోపే.. అవి చిరుజల్లులతో సరిపెట్టి దాగుడు మూతలు ఆడుతున్నాయి. దీంతో తొలకరి పలకరింపుతో సాగుకు సిద్ధమైన రైతులు.. తదుపరి వాన జాడ కానరాకపోవడంతో దిగాలు పడిపోయారు. కాస్త ముందు పెట్టిన రైతుల విత్తనాలు మొలకెత్తాయి. వారం క్రితం విత్తినవి భూమిలోనే మాడిపోయే అవకాశం ఉంది. ముందు మొలకెత్తినవి కూడా ఎండ తీవ్రతకు తట్టుకోలేక నేల చూపులు చూస్తున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు పడకపోతే వేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి కోల్పోవాల్సి వస్తుందని కర్షకులు చెబుతున్నారు.

వారం గడిచింది..



వారం రోజుల క్రితం కురిసిన వర్షాలతో పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తాం. కానీ అప్పటి నుంచి చినుకు కూడా రాలలేదు. దీంతో ఒక్క గింజ కూడా మొలకెత్తలేదు.

– శివారెడ్డి, ముబారక్‌పూర్

రెండోసారి కష్టమే



ఒక్కసారి విత్తనాలు పెట్టడమే ఇబ్బంది. అవి మొలకెత్తక పోతే రెండోసారి వేయడం మరింత కష్టంతో కూడుకున్న పని. ఈ సారి వర్షాలు ఆదిలోనే నష్టాలు చూపిస్తున్నాయి. చివరకు ఏం చేస్తాయో..

– సామ వెంకట్‌రెడ్డి, రైతు

కరుణించు వరుణుడా

కుల్కచర్ల: సమృద్ధిగా వర్షాలు పడి.. పాడి పంటలతో పల్లెలు కళకళలాడాలని రైతులు పూజలు చేశారు. సోమవారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో పోచమ్మ సన్నిధిలో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. వానలు కురువక, విత్తిన విత్తులు మొలవక ఇబ్బంది పడుతున్నామని, వరుణుడు కరుణించి వర్షాలు కురింపించేలా చూడు తల్లీ అని వేడుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, నాయకులు రాంజీ, రెడ్యా, సంతోష్, ప్రకాష్, పాండు, సంతోష్ పాల్గొన్నారు.



పోచమ్మ సన్నిధిలో రైతులు

మైనార్టీల అభ్యున్నతికి కట్టుబడిన ప్రభుత్వం



ఐడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.90 లక్షల నిధులతో ప్రహరీ, కమ్యూనిటీ హాల్, ఉర్దూ పాఠశాల భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ బిడ్డల చదువుల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ కుమార్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ అజీజ్, నాయకులు అంజయ్య, మల్లేశం, అప్సర్, మైబెల్లి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు



జాబితా సవరణలో నిమగ్నమైన రెవెన్యూ అధికారులు

కొడంగల్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఓటరు జాబితాను అధికారులు సవరిస్తున్నారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, మద్దూరు, కోస్గి, దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి మండలాల రెవెన్యూ అధికారులు జాబితా సవరణను వేగిరం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. అన్ని మండలాల్లో ఇప్పటికే పలు దరఖాస్తులు వచ్చాయి. బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో పర్యటించి వలస వెళ్లిన వారు, చనిపోయిన వారు, పేర్లలో తప్పు ఒప్పులు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. వాటికి అనుగుణంగా జాబితాలో మార్పులు చేర్పులు చేపడుతున్నారు. కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్ బుచ్చయ్య, ఎలక్షన్ డీటీ సురేష్‌తో పాటు పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- గురువులను సన్మానించిన శిష్యులు



యాలాల: అన్నదానం చేస్తున్న శంకర్ యాదవ్ తదితరులు

బంట్వారం: గురు పౌర్ణమి సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక సాయిబాబా ఆలయంలో సోమవారం భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు, భక్తి పాటలతో భక్తిని చాటుకున్నారు.

ఆలయాల్లో అభిషేకాలు

కొడంగల్: గురుపౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో లింగమయ్యకు భక్తులు అభిషేకం చేశారు. మహాదేవుని ఆలయంలో అర్చకుడు గర్జం రాచయ్య, గాడిబాయి శివాలయంలో అర్చకుడు కిట్టుస్వామి పూజలు చేశారు.

భక్తులకు అన్నదానం

యాలాల: గురుపౌర్ణమి సందర్భంగా యాలాల మండలం కోకట్ మార్గం సాయిబాబా ఆలయానికి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు తాండూరు పట్టణానికి చెందిన శ్రీసాయిపుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శంకర్ యాదవ్, చంద్రకళ దంపతులతో బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రాజ్‌కుమార్ ఉన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ఆషాఢమాసం పౌర్ణమి రోజున జరుపుకొనే గురుపౌర్ణమి ప్రత్యేకతను బొంరాస్‌పేట, దుద్యాల మండలం ఉపాధ్యాయులు వివరించారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాల్లో గురుభక్తికి ఎంతో ప్రాధాన్యం ఉండేదన్నారు. గురుశిష్యుల బంధాన్ని చిరకాలం చాటుకోవాలని ఉపాధ్యాయులు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు పాపిరెడ్డి, నెహ్రూ, రవీందర్‌గౌడ్, అనిల్ కుమార్, విజయలక్ష్మి, శివర్థ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. సంగమేశ్వర భక్త సమాజం ఆవరణలో గురుపౌర్ణమి పూజలు, అన్నదానం చేశారు. భక్తులు, హైందవ బంధువులు ఉదయం 9గంటలకు హాజరై భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గురువు లేనిదే విద్యలేదు

పరిగి: గురువు లేనిదే విద్య లేదని, గురువు దేవుడితో సమానమని కృష్ణానంద గురుస్వామి అన్నారు. పట్టణ కేంద్రంతో పాటు బసిరెడ్డిపల్లి క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయి మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

తాగునీటి కష్టాలు

పరిగి: తాగు నీటికోసం రాఘవపూర్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మిషన్ భగీరథ జలాలు రాక, బోరు నీరు సరఫరా లేక గ్రామస్తులు పొలాల బాట పట్టారు. బోరులో పుష్కలంగా నీరు ఉన్నా.. తాగునీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు భగీరథ నీరు, అటు బోరు నీరు రాక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మూడోసారి సీఎం కావాలి



యజ్ఞం చేస్తున్న వర్ధనందు దంపతులు

అనంతగిరి: ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి అధికారం చేపట్టాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వర్ధనందు దంపతులు సోమవారం వికారాబాద్ మండలం ఎనాపూర్ షిరిడీ సాయి బాబా ఆలయంలో యజ్ఞం చేశారు. అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. ఈ సందర్భంగా తన గురువైన డాక్టర్ వీరయ్య, రాజకీయ గురువు హన్మంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీలు చంద్రకళ, విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు జీఎస్‌జీ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ గొండ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం బూచన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల 120 మంది విద్యార్థులకు రూ.50 వేల విలువ చేసే నోట్ బుక్స్‌ను ట్రస్ట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు మదనాచారి, అరవింద్, ఉపాధ్యాయులు మాణిక్యం, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, విజయకుమార్, రాజేందర్, పుష్పకుమారి పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

పెద్దేముల్: కందనెల్లి గ్రామం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ప్రచార సమితి సహకారంతో కార్యక్రమం చేపట్టారు. సేరి నర్సిరెడ్డి దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మధులత, సర్పంచ్ మోహన్‌రెడ్డి, పూజారి తుమ్మల శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.



సత్యనారాయణ వ్రతంలో భక్తులు

దరఖాస్తులకు పరిష్కారం చూపండి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



వికారాబాద్ అర్బన్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి, పరిష్కార మార్గం చూపాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన 278 ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి, ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు నిల్

బంట్వారం: ప్రజావాణిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అఫ్జల్ రసూల్ రైతులకు సూచించారు. కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు రాలేదని తెలిపారు. ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు చెప్పారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- హరితహారం మొక్కలు సిద్ధం చేయాలి
- డివిజన్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్



అన్నారంలో హరితహారం మొక్కలను పరిశీలిస్తున్న శంకర్‌నాయక్

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని తాండూర్ డివిజన్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం కొడంగల్ మండలం చిట్లపల్లి, నాగారం, అన్నారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. హరితహారం, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మురికి నీరు నిలువ ఉండకుండా, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ప్రజలు నివాసం ఉండకుండా.. తాత్కాలిక పద్ధతిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, బంధువుల ఇళ్లకు పంపించేందుకు కృషి చేయాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతు చేయించాలని, దోమలు పెరగకుండా బైటెక్స్, మెలాథియాన్ ద్రావణాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని, బ్లీచింగ్ పౌడర్, సున్నం, హైపోక్లోరైడ్‌లను అందుబాటులో ఉంచుకోవాలని, గ్రామాల్లో ఎవరికైనా జ్వరం, డెంగీ, మలేరియా వంటి సూచనలు కనిపిస్తే వెంటనే ఆశ వర్కర్లు, వైద్యాధికారులను సంప్రదించేలా తగిన సూచనలు చేయాలని పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పూడూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

పూడూరు: బీజేపీ పాలనలో అర్హులందరికీ మేలు జరుగుతుందని, వారికి నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పార్టీ మండల పాలక్ దేవరాజ్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం పూడూరు మండలం దేవనోనిగూడలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, బీజేపీని మరోసారి ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్, మండల అధ్యక్షుడు అనిల్ ముదిరాజ్, జిల్లా నాయకులు బుచ్చన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బంట్వారం: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ విస్తారక్ సెల్వం కుమార్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బంట్వారం మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించి మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బసిరెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

మండల విద్యాధికారి హరిశ్చందర్



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

దోమ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు సహకారం అందించడం ఎంతో అభినందనీయమని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. సోమవారం దోమ మండలం గొట్లచెల్కతండా అనుబంధ గ్రామమైన మెట్టుగడ్డతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు.. చందర్ అనే యువకుడు నోట్‌బుక్స్, పలకలు పంపిణీ చేశారు. అదే విధంగా తండా నుంచి పాఠశాలకు విద్యార్థులు రావాలంటే ఇబ్బంది పడుతున్నారని, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ తన సొంత డబ్బుతో ఆటోను ఏర్పాటు చేసి రవాణా కష్టాల నుంచి గట్టెక్కించారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డారు. దీంతో సర్పంచ్, దాతను ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేంద్ర బహదూర్, ఉపసర్పంచ్ రవి, పాఠశాల చైర్మన్ చాందిబాయ్, సీఆర్‌పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయులు రాకేశ్, గ్రామస్తులు చందర్, దేవేందర్, రమేశ్, గణేశ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఉడకని అన్నం.. నీళ్లచారు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థులు, బీజేపీ నేతలు

- పట్టించుకోని వార్డెన్
- ఆశ్రమ విద్యార్థుల ఆరోపణ
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



ఉడకని అన్నం, నీళ్లచారును చూపిస్తున్న విద్యార్థులు

కుల్కచర్ల: 'ఉడికీ ఉడకని అన్నం, నీళ్లచారుతో భోజనం పెడుతున్నారు. దీన్ని ఎలా తినాలి? వసతి గృహాన్ని శుభ్రం చేయించడం లేదు. కనీస సౌకర్యాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు' అని ఆరోపిస్తూ చౌడాపూర్ మండలం కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. ఈ మేరకు సోమవారం ఎనిమిది కిలో మీటర్ల మేర నడిచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సరైన భోజన వసతి కల్పించకపోవడమే కాకుండా.. స్నాక్స్ ఇవ్వడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, తరగతుల పర్యవేక్షణకు వార్డెన్ రావడం లేదని, కేవలం తన గదిలో మద్యం తాగడానికి మాత్రమే సమయం వెచ్చిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించే వార్డెన్ తమకొద్దని పట్టుబట్టారు. కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్ అశోక్‌కుమార్ డీటీడబ్ల్యూఓ కోటాజీతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. వారికి మద్దతుగా బీజేపీ మండల అధ్యక్షుడు బందయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, మక్తవెంకటాపూర్ నాయకులు వెంకట్ తదితరులు ఉన్నారు.